క్లుప్తంగా

భట్టిప్రోలు ఎంపీడీఓగా రమణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎంపీడీఓగా ఎస్‌వీ రమణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన గుమ్మా చంద్రశేఖరరావు బదిలీపై పొన్నూరు వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ రమణ మాట్లాడుతూ మండలం అభివృద్ధికి విశేష కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీఓ రమణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కొత్త ఎంపీడీఓను సత్కరించారు.

వరి పొలాల పరిశీలన



చుండూరు(వేమూరు) చుండూరు మండలంలోని మోదుకూరు, పెదగాదెలవర్రు గ్రామాల్లో వరి పొలాలను ఈ–పంట నమోదు సూపర్‌వైజర్, జిల్లా వ్యవసాయాధికారి వై. రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఎరువుల లభ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నీటమునిగిన పొలాల్లో చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ఆదాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ



పెదలంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదలంక పంచాయతీలోని మధ్యగూడెంకు చెందిన ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు విశ్రాంత హౌసింగ్ ఏఈ ఆరుంబాక ప్రకాశరావు, పుష్పాంజలి శుక్రవారం నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఇటీవల కృష్ణానదికి వరదలు సంభవించిన నేపథ్యంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రకాశరావు రూ.25 వేలు వ్యయం చేసి పుస్తకాలు, స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ముట్లూరి వెంకయ్య, మాలతీ దంపతులు పాల్గొన్నారు.

కర్లపాలెం తహసీల్దార్‌గా సుందరమ్మ



కర్లపాలెం: కర్లపాలెం తహసీల్దార్‌గా సుందరమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు వేసి బొకే అందజేసి స్వాగతం పలికారు. సుందరమ్మ నెల్లూరు జిల్లా కొండాపూర్ మండలం నుంచి బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఇప్పటి వరకు కర్లపాలెంలో తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరత్నం కలెక్టరేట్ కార్యాలయం ఏవోగా బదిలీపై వెళ్ళారు.

ఈ-పంట నమోదు చేయించాలి



కర్లపాలెం: రైతులందరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించాలని ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె కర్లపాలెం చింతాయపాలెం, పేరలి, సమ్మెటవారిపాలెం, యాజలి గ్రామాలలో పర్యటించి గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉన్న పంట నమోదు రికార్డులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు ఈనెల 7వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఏడీఏ వెంట ఏవో సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గడ్డి దగ్ధం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని చావలి బస్టాండ్ సమీపంలో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌పై నిప్పురవ్వలు పడడంతో రెండెకరాల గడ్డి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి భట్టిప్రోలు నుంచి చావలి వైపు వెళుతున్న ట్రాక్టర్ స్థానిక ఓ ప్రైవేట్ వైద్యశాల వద్దకు వచ్చే సరికి చిన్న పిల్లలు మందుగుండు సామగ్రి కాల్చడంతో నిప్పు రవ్వలు ట్రాక్టర్‌పై ఉన్న గడ్డిని తాకాయి. గమనించిన స్థానికులు ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి మోపులను కిందకు పడవేశారు. దీంతో ఆ మోపులు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అప్రమత్తమై గడ్డిమోపులను కింద పడేయడంతో ట్రాక్టర్‌పై ఉన్న వారికి ఏ ప్రమాదం జరగలేదు. పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు.

అడుగుకో గుంత.. కష్టాలే దారంతా..

రేపల్లె మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంత.. అవస్థలే ప్రయాణమంతా అన్నట్టుగా ఉంది దుస్థితి. ఈ చిత్రాలు తుమ్మల నుంచి నల్లూరుపాలెం వరకు పలుచోట్ల ప్రధాన రహదారిలోనివి. మోర్లగుంట, గంగడిపాలెం, తుమ్మల, చలపాటివారిపాలెం, బొందలగరువు, కైతేపల్లి, పోటుమెరక, వడ్డీవారిపాలెం, సింగుపాలెం తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. ఈ దారి పొడవునా గోతులు పడడంతో ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి కనీసం మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– రేపల్లె రూరల్











ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఇసుక కొరతను నివారించాలని కోరారు. వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఇంకా ఇసుక పాలసీని ఖరారు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరు వల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ప్రారంభించి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.కిషోర్, కె.ఆశీర్వాదం, కే.గోపి, వి.మాహో, కె.రమేష్, డి.అగస్టిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ధర్మరాజు, నాయకులు చిట్టిబాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రేపు అద్దేపల్లిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తెనాలి శ్రీలక్ష్మి విజన్ కేర్ సెంటర్ అధినేత డాక్టర్ పంచుమర్తి భాస్కరరావు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వి.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజన్ కేర్ సెంటర్ వైద్య బృందం అన్ని రకాల కంటి సమస్యలకు ఆధునిక పరికరాలతో ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

చెరుకుపల్లి: ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కనగాల హాజీ మహమ్మద్ ఖాసీమ్ సాహెబ్ మహమ్మద్ గాలాబ్ సాహెబ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ సమ్మద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కనగాల బీఈడీ కళాశాల ఆవరణలో వారి సహకారంతోనే ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కంటి, కిడ్నీ బాధితుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వివరించారు. శిబిరానికి వచ్చే వారు, రేషన్ కార్డు, ఓటరు కార్డు, లేదా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలని తెలిపారు.

ధార్మిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

నిజాంపట్నం: గ్రామ ధార్మిక సమితి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు కోరారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజాంపట్నంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో మండల కన్వీనర్ కాశేపల్లి గౌరీ శంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హేమశంకరరావు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఈనెల 20, 22, 25, 27 తేదీల్లో గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ రక్షణ కోసం గ్రామ ధార్మిక సమితుల సభ్యులకు అవగాహన కల్పించడం కోసం ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈనెల 12న శనివారం సత్సంగం, 16, 17 తేదీల్లో పౌర్ణమి హారతులు, నగర కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజాంపట్నం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ అక్కల సుబ్బారెడ్డి , మండల మహిళా కన్వీనర్ సుగుణార్థిని, మోపిదేవి వెంకటేశ్వరరావు, మొదారయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలు

భట్టిప్రోలు: పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో అందచేశారు. గతనెల 23 నుంచి 28 వరకు ఈ సెంటర్‌లో శిక్షణ తరగతులు జరిగాయి. కార్పెంటర్లకు సెంటర్ మేనేజర్ కోటి స్పందనా దేవి ఏపీ వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావుకు ఈ ధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పవన్, రఘు, ఎన్.రాణి, పి.శివపార్వతి, పల్లవి పాల్గొన్నారు.



కార్పెంటర్‌కు వృత్తి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, తూర్పు హరిజనవాడ, గూనివారిపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు వివరించారు.

చుండూరు మండలంలో..

చుండూరు(వేమూరు) చుండూరు మండల కేంద్రం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మోదుకూరు విద్యుత్ ఉప కేంద్రం విద్యుత్ లైన్‌లలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ సబ్ ఇంజినీరు లంక అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

జగజ్జననీ జయహే

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం కావడంతో కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల వేదమాత గాయత్రీదేవిగా కటాక్షించారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించి భక్తులు పులకించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

– రేపల్లె రూరల్/ చెరుకుపల్లి/ నగరం/ కర్లపాలెం/భట్టిప్రోలు/బాపట్ల టౌన్/వేమూరు



రేపల్లెలో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న బూరుగులమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



చెరుకుపల్లిలో శ్రీమహాలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు



నగరం వేంకటేశ్వర స్వామి గుడిలో గాయత్రి దేవి అలంకరణ



కర్లపాలెం మండలం బోలాయపాలెలో గాయత్రీదేవి అలంకరణ



కోనేటిపురంలో గాయత్రి మాతకు చిన్నారుల పూజలు



బాపట్ల లలితా త్రిపుర సుందరీ పీఠం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వేమూరు మండలం చావలిలో గాయత్రీదేవి అలంకరణ

ఎంపీడీఓగా శివన్నారాయణ

వేమూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శివన్నారాయణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో పని చేసిన ఎంపీడీఓ శేషగిరిరావు బదిలీపై కృష్ణా జిల్లా వెళ్లారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న శివన్నారాయణ బదిలీపై వచ్చారు.

7,8,9 తేదీల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

రేపల్లె రూరల్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం ఈనెల 7, 8, 9 తేదీలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించిందని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు కళాశాల పనిచేయు వేళల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించి కావాల్సిన గ్రూప్‌లలో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కాలువలో దూకిన యువకుడు

కొనసాగుతున్న గాలింపు చర్యలు

బాపట్లటౌన్: కాలువలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం జరిగింది. పట్టణంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన నాగరాజు కొంత కాలంగా పట్టణపరిధిలోని ఎస్ఎన్‌పీ అగ్రహారం సమీపంలో బిర్యానీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై మండలంలోని నాగరాజు కాలువ సమీపానికి చేరుకుని సెల్‌ఫోన్ కాలువ గట్టుపై వదిలి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నాగరాజు కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

బాపట్లకు వెలగపూడి సేవలు అమోఘం

బాపట్లటౌన్: బాపట్ల పట్టణానికి ప్రప్రథమ మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బారావు అందించిన సేవలు అమోఘమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. వెలగపూడి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో చంద్రకళ పార్కులోని వెలగపూడి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ వెలగపూడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.



వెలగపూడి సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు

వికలాంగులను అవమానించిన వేగేశన

- సదరన్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి దివ్యాంగులకు లేని ఆహ్వానం
- ఎమ్మెల్యే తీరుపై జనసేన దివ్యాంగుల విభాగం నేత గోగన ఆదిశేషు ధ్వజం

బాపట్లటౌన్: ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వికలాంగులంటే అలుసని జనసేన పార్టీ దివ్యాంగుల విభాగం నేత గోగన ఆదిశేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిశేషు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1న బాపట్లలోని ఏరియా వైద్యశాలలో నిర్వహించిన సదరన్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీలు నియమించిన దివ్యాంగుల సంఘం నాయకులకు ఆహ్వానం పంపలేదని విమర్శించారు. ఇది దివ్యాంగులను అవమానించడమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేగేశన తీరుపై దివ్యాంగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, త్వరలో వికలాంగుల సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధ్వజమెత్తారు.



గోగన ఆదిశేషు

ఆయుర్వేదం.. నిర్వేదం



శిథిలావస్థకు చేరిన ఆయుర్వేద వైద్యశాల



ఆస్పత్రి గేటుపై దుస్తులు ఆరవేసిన దృశ్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ భవనం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అంటే నమ్ముతారా? నిజమే ఇది 85 ఏళ్ల క్రితం నిర్మించిన వైద్యశాల. శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ స్థలం విస్తీర్ణం మొత్తం 32 సెంట్లు. ఇందులో ఆరు సెంట్లు ఆక్రమణకు గురైంది. ఫలితంగా ఆవరణ చిన్నవర్షం పడినా మునిగిపోతోంది. ఇక్కడ పనిచేసే ఎంఎన్ఓ కొల్లూరు మండలం క్రాపలోనూ, కాంపౌండర్ వేమూరు మండలం జంపనిలోనూ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ లేరు. క్రాప వైద్యాధికారి నాగసుధ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఎంఎఫ్ఓ, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి పనిచేయడం లేదు. ఇన్‌చార్జి వైద్యాధికారి అప్పుడప్పుడు గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసి, పోస్టులు భర్తీచేసి ఓపీ కొనసాగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– భట్టిప్రోలు

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



రేపల్లె రూరల్: పంట వివరాలను నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ ప్రక్రియ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిరాట్లంక, చోడాయపాలెం, గంగడిపాలెం గ్రామాలలో శుక్రవారం సాగుభూములను ఆయన సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈనెల 7వతేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. అనంతరం ఈక్రాప్ బుకింగ్‌లో పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

పీవీపాలెం ఈవోపీఆర్డీగా ఎలీషాబాబు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల పరిషత్ ఈవోపీఆర్డీగా ఎ.ఎలీషాబాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు కర్లపాలెం ఈవోపీఆర్డీగా పనిచేస్తూ బదిలీపై పిట్టలవానిపాలెం వచ్చారు. పిట్టలవానిపాలెం పంచాయతీరాజ్ ఏఈగా ఎం.రఘు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు నుంచి బదిలీపై పిట్టలవానిపాలెం వచ్చారు.